# షుగర్ పేషెంట్లకు నేచురల్ రెమిడీ

**ఈ గ్రీన్ జ్యూస్‌లతో షుగర్ కంట్రోల్ .!**



నేటి జీవనశైలిలో, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారి సంఖ్య మరింత పెరిగింది. డయాబెటిస్ అనేది ఒక దీర్ఘకాలిక వ్యాధి. దీనిని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు, కానీ ఆహారం ద్వారా దానిని నియంత్రించవచ్చు. కాబ ట్టి, ఈ వ్యాధితో బాధపడేవారు రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడానికి తమ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అయితే, చక్కెర స్థాయిని అదుపులో ఉంచడానికి కొన్ని గ్రీన్ జ్యూస్‌లు మీకు సహాయపడతాయి. ఆ జ్యూస్‌లు ఏవో ఇప్పుడు తెలుసుకుందాం..

**మునగాకు రసం:**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, మునగ రసం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే పోషకాలు శరీరంలో ఇన్సులిన్ మొత్తాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచుతుంది.

**కాకరకాయ రసం:**

మధుమేహ రోగులకు కాకరకాయ రసం ఒక ఔషధం లాంటిది. ఇందులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. కాకరకాయ రసంలో పాలీపెప్టైడ్-పి ఉంటుంది. ఇది ఇన్సులిన్ లాంటి మూలకం. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

**పాలకూర రసం:**

పాలకూర రసం తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. దీన్ని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. పాలకూర రసం తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం తగ్గుతుందని అనేక అధ్యయనాలు కనుగొన్నాయి.

**సొరకాయ రసం:**

సొరకాయ రసంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీని గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం రక్తంలో చక్కెరను పెంచదు. దీనితో పాటు, ఇందులో పుష్కలంగా ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని వినియోగం జీర్ణ సంబంధిత సమస్యలను కూడా తొలగిస్తుంది.

**కలబంద రసం:**

డయాబెటిస్ రోగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి కలబంద రసం తీసుకోవచ్చు. ఇందులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది.




# పదవీ విరమణ వరకు అక్కర్లేదు..

**మీ పీఎఫ్ మొత్తం ఒకేసారి తీసుకునే ఛాన్స్**

ప్రతి నెల జీతం పొందే ఉద్యోగులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే ఇకపై ప్రావిడెంట్ ఫండ్ (%జూఖీ%) పొదుపులను ఉపసంహరించడానికి పదవీ విరమణ లేదా ఉద్యోగం కోల్పోయే వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. పీఎఫ్ చందా దారులు ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి తమ మొత్తం కార్పస్‌ను లేదా దానిలో కొంత భాగాన్ని ఉపసంహరించుకునే (PF Withdrawal Rules) అవకాశం పొందవచ్చు. ఈ మార్పు ఉద్యోగులకు తమ ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో సౌలభ్యాన్ని అందిస్తుంది.

**పూర్తి నిధులను..**

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఉపసంహరణ నిబంధనలను సులభతరం చేయడానికి సిద్ధం చేసిన ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే మరికొన్ని రోజుల్లో అమల్లోకి రానుంది. ప్రస్తుతం పీఎఫ్ సభ్యులు తమ పూర్తి నిధులను ఉపసంహరించుకోవడానికి కొన్ని నిర్దిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీటిలో సాధారణంగా 58 సంవత్సరాల వయస్సులో రిటైర్మెంట్ తర్వాత లేదా రెండు నెలల కంటే ఎక్కువ కాలం నిరుద్యోగం ఉంటే, కొన్ని నిర్దిష్ట అవసరాల కోసం మాత్రమే అనుమతించబడేది.

**ఖర్చులను కూడా..**

దీంతోపాటు ఇంటి కొనుగోలు లేదా నిర్మాణం, వైద్య అత్యవసర పరిస్థితులు, విద్యా ఖర్చులు, వివాహ సంబంధిత ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకునే వారు. ఈ నిబంధనలు ఉద్యోగులకు కొంత సౌలభ్యాన్ని అందించినప్పటికీ, నిధులను యాక్సెస్ చేయడంలో మాత్రం ఆంక్షలు ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు కొత్త నిబంధనలతో మార్పు చేయనున్నారు.

**ఏం మారింది**

ఈ నెల నుంచి పీఎఫ్ సభ్యులకు ఇంటి కొనుగోలు లేదా నిర్మాణం కోసం తమ పొదుపులలో 90 శాతం వరకు ఉపసంహరించే అవకాశం కల్పించారు. గతంలో, ఈ ప్రయోజనం కేవలం ఐదు సంవత్సరాల నిరంతర చందా తర్వాత మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఈ అర్హత వ్యవధిని మూడు సంవత్సరాలకు తగ్గించారు. ఈ మార్పు ఎక్కువ మంది ఉద్యోగులు తమ పొదుపులను ఇంటి నిర్మాణం లేదా కొనుగోలు కోసం ఉపయోగించుకునేందుకు వీలు కల్పిస్తుంది.

**ఈ మార్పులు ఎందుకు ముఖ్యం**

అంతేగాక అడ్వాన్స్ క్లెయిమ్ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచారు. ఈ కొత్త నిబంధనలు నిధులను యాక్సెస్ చేయడాన్ని మరింత సులభతరం చేస్తాయి. ఎందుకంటే ఇప్పుడు ముందస్తు ఆమోదాల అవసరం లేకుండా త్వరగా నిధులను పొందవచ్చు. ఈ మార్పులు ఉద్యోగులకు తమ ఆర్థిక అవసరాలను తీర్చడంలో మరింత స్వేచ్ఛను అందిస్తాయి. ఈ కొత్త నిబంధనలు ఉద్యోగులకు తమ ఆర్థిక భవిష్యత్తును మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసుకునే అవకాశాన్ని అందిస్తాయి. గతంలో పీఎఫ్ నిధులను యాక్సెస్ చేయడానికి ఎక్కువ కాలం పట్టేది. కానీ ఇప్పుడు ఈ సరళీకృత నిబంధనలతో ఉద్యోగులు తమ జీవితంలో ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలను తీసుకునేందుకు మరింత అవకాశం ఉంటుంది.

# అరటిపండు తిన్న తర్వాత నీళ్లు తాగొచ్చా?

అరటిపండు ఒక రుచికరమైన పండు. దీనిని అన్ని వయసుల వారు ఇష్టపడతారు. పిల్లలు కూడా అరటిపండును చాలా ఇష్టంగా తింటారు. అరటిపండు మెత్తగా, తీపిగా ఉంటుంది. ఇది శక్తితో నిండి ఉంటుంది. అరటిపండు ప్రతి సీజన్‌లో లభిస్తుంది. చాలా మంది అల్పాహారంలో, పాలతో తినడానికి కూడా తింటారు. అయితే, అరటిపండు తిన్న వెంటనే నీరు తాగకూడదని అంటారు. అయితే, అరటిపండు తిన్న తర్వాత నీళ్లు తాగితే ఏమవుతుంది? ఎందుకు నీళ్లు తాగకూడదని అంటారు? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..



ఆయుర్వేదం ప్రకారం, అరటిపండు చల్లని ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఇందులో పొటాషియం, ఫైబర్, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, దాని చల్లని స్వభావం జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మదిస్తుంది. ముఖ్యంగా అరటిపండు తిన్న వెంటనే చల్లటి నీరు తాగితే, అది జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. అరటిపండులో సహజ చక్కెర, ఫైబర్ ఉంటాయి. ఇది శరీరం జీర్ణం కావడానికి సమయం పడుతుంది. మీరు దానిని తిన్న తర్వాత నీరు తాగితే అది గ్యాస్, వాపు, అజీర్ణం లేదా గొంతు నొప్పి వంటి సమస్యలను కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, ఈ కలయిక ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉంటుంది.

ఆధునిక శాస్త్రం ప్రకారం, అరటిపండు తిన్న తర్వాత నీరు తాగడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదు. అయితే, జీర్ణవ్యవస్థ సున్నితంగా ఉండే కొంతమందిలో ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను పెంచుతుంది. అందువల్ల, జీర్ణక్రియ సరిగ్గా జరగడానికి అరటిపండు తిన్న కనీసం 20-30 నిమిషాల తర్వాత నీరు తాగాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. మీకు చాలా దాహం వేసి నీరు తాగవలసి వస్తే గోరువెచ్చని నీరు తాగాలి. ఇది జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని కలిగించదు. గ్యాస్ లేదా అసిడిటీ వంటి సమస్య ఉండదు. అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఎముకలు బలపడతాయి. ఈ పండు గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో పొటాషియం, ఫైబర్, విటమిన్ బి6, విటమిన్ సి ఉంటాయి. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో, మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో, కండరాల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. అరటిపండు తక్షణ శక్తిని ఇస్తుంది, కాబట్టి వ్యాయామానికి ముందు లేదా ఉదయం అల్పాహారంలో దీన్ని తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

# దానిమ్మ గింజలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చా?

దానిమ్మ పండులో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇది యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. క్యాన్సర్ కణాలతో పోరాడడంలో సహాయపడుతుంది. దానిమ్మ పండు రుచితో పాటు ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్ శరీరానికి మేలు చేస్తాయి. అయితే, చాలా మంది దానిమ్మ విత్తనాలను ఫ్రిజ్‌లో నిల్వ చేస్తారు. కానీ, దానిమ్మ గింజలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం ఆరోగ్యానికి మంచిదేనా? ఈ విషయంపై ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

చాలా మంది దానిమ్మ గింజలను ఒక ప్లేట్ లేదా ఓపెన్ బౌల్‌లో ఉంచి ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే, ఇలా చేయడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ గింజలు ఎండిపోవడమే కాకుండా వాటి రుచి, పోషకాలు పోతాయని అంటున్నారు. మీరు దానిమ్మ గింజలను ఫ్రిజ్‌లో నిల్వ చేయాలనుకుంటే, ముందుగా వాటిని గాలి చొరబడని కంటైనర్‌లో నింపండి. ఈ కంటైనర్‌ను సరిగ్గా మూసి ఫ్రిజ్‌లో ఉంచండి. ఈ విధంగా దానిమ్మ గింజలు 2 నుండి 3 రోజులు తాజాగా ఉంటాయి. ప్రతిసారీ వాటిని ఫ్రిజ్ నుండి తీసిన తర్వాత, తేమ లోపలికి రాకుండా వెంటనే మూసివేయాలని గుర్తుంచుకోండి. దానిమ్మ గింజలను ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచకూడదని గుర్తుంచుకోండి. ఎందుకంటే దానిలో ఉండే తేమ వాటిలో బ్యాక్టీరియా పెరిగే ప్రమాదాన్ని పెంచుతుంది. విత్తనాలు రంగు కోల్పోవడం లేదా వింత వాసన వస్తాయి. కాబట్టి, గాలి చొరబడని కంటైనర్‌లో వాటిని ఉంచడం మంచిది. అంతేకాకుండా, వీలైనంత త్వరగా వాటిని తినడం మంచిది. లేదంటే వాటి రుచి, పోషకాలు తగ్గిపోతాయి. అప్పుడు తిన్న ఆరోగ్య ప్రయోజనాలు ఉండవు.



# పురుషులు ఈ ఆహార పదార్థాలు ఎక్కువగా తింటే.. ఇక అంతే..!

నేటి బిజీ జీవితంలో, చాలా మంది పురుషులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. పని ఒత్తిడి, నిద్ర లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, తప్పుడు జీవనశైలి క్రమంగా శరీరాన్ని లోపలి నుండి బలహీనపరుస్తాయి. అయితే, పురుషులు ఎక్కువగా పుల్లని పదార్థాలు తినకూడదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. పురుషులు పుల్లని పదార్థాలు ఎందుకు తినకూడదు? దీనికి కారణం ఏమిటి? తింటే ఏం జరుగుతుంది? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

పుల్లని పదార్థాలు రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యకరమైనవిగా కూడా మంచివి. కానీ, పురుషుల శరీర నిర్మాణం, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం ముఖ్యం. ఆయుర్వేదం ప్రకారం పురుషులు పుల్లని పదార్థాలను ఎక్కువగా తినకూడదు. ముఖ్యంగా ఖాళీ కడుపుతో నిమ్మ, చింతపండు, ఊరగాయలు, టమోటాలు లేదా ఎక్కువ పెరుగు వంటి పుల్లని పదార్థాలు తినడం ఆరోగ్యానికి హానికరమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**ఎందుకు హానికరం?**

పుల్లని పదార్థాలలో సహజ ఆమ్లాలు ఉంటాయి. ఉదాహరణకు, నిమ్మకాయలో సిట్రిక్ ఆమ్లం, టమోటాలలో టార్టారిక్ ఆమ్లం, పెరుగులో లాక్టిక్ ఆమ్లం కనిపిస్తాయి. ఈ ఆమ్లాలను పరిమిత పరిమాణంలో తీసుకుంటే అవి జీర్ణక్రియకు సహాయపడతాయి. కానీ, పెద్ద పరిమాణంలో లేదా తప్పుడు సమయంలో తీసుకుంటే అవి శరీరంలోని ఆమ్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి.

**టెస్టోస్టెరాన్ స్థాయిపై ప్రభావం**

పుల్లని పదార్థాలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా పురుషులు ఎక్కువగా పుల్లని ఆహారాన్ని తింటే, అది టెస్టోస్టెరాన్ హార్మోన్‌ను తగ్గిస్తుంది. ఈ హార్మోన్ పురుషుల బలం, శక్తి, లైంగిక సామర్థ్యానికి సంబంధించినది.

**జీర్ణ సమస్యలు**

ఎక్కువగా పుల్లని ఆహారం తినడం వల్ల అసిడిటీ, కడుపులో చికాకు, గ్యాస్ వంటి సమస్యలు పెరుగుతాయి. పురుషులు తరచుగా ఆఫీసు లేదా ఫీల్డ్ వర్క్ సమయంలో ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారు. ఇది వారి దృష్టి, శక్తి రెండింటినీ ప్రభావితం చేస్తుంది.

**జుట్టుపై ప్రభావం**

పుల్లని పదార్థాలను ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే, అది జుట్టు మూలాలను ప్రభావితం చేస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, ఇది జుట్టు రాలడానికి, జుట్టు త్వరగా నెరయడానికి దారితీస్తుంది.



**ఎముకల బలహీనత**

పుల్లని పదార్థాలు శరీరం నుండి కాల్షియం శోషణను తగ్గిస్తాయి. ఇది ఎముకలు బలహీన పడటానికి దారితీస్తుంది. ముఖ్యంగా పురుషులు 40 సంవత్సరాల తర్వాత దీనిపై శ్రద్ధ వహించాలి.

**దంతాలపై ప్రభావం**

నిమ్మకాయ లేదా చింతపండు వంటివి పదే పదే తినడం వల్ల దంతాల ఎనామిల్ తొలగిపోతుంది. దీనివల్ల దంతాలు సున్నితంగా మారతాయి. చిగుళ్ళ బలహీనంగా మారవచ్చు.

**మానసిక ఒత్తిడి**

కొన్ని అధ్యయనాల ప్రకారం, పుల్లని పదార్థాలను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. ఇది చిరాకు, నిద్ర లేకపోవడం, మానసిక అశాంతి వంటి సమస్యలను కలిగిస్తుంది.

**ఎక్కువగా ఇష్టపడితే.. మితంగా..**

మీరు పుల్లని పదార్థాలను ఎక్కువగా ఇష్టపడితే, మీరు దానిని మితంగా తినవచ్చు. పప్పులో కొంచెం నిమ్మకాయ లేదా సలాడ్‌లో కొంచెం తినవచ్చు. పెరుగు పగటిపూట తినవచ్చు, కానీ రాత్రిపూట తినకూడదు. రోజూ ఊరగాయలు తినకుండా అప్పుడప్పుడు మాత్రమే చింతపండు తినడానికి ప్రయత్నించండి. ఉదయం నిద్రలేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు, వ్యాయామం చేసిన తర్వాత పుల్లని పదార్థాలు అస్సలు తినకూడదు. మీకు ఇప్పటికే అసిడిటీ సమస్య ఉంటే పుల్లని పదార్థాలను తినడం మానుకోవాలి.

నిమ్మకాయకు బదులుగా కొబ్బరి నీళ్లు తాగండి

చింతపండుకు బదులుగా ఆమ్ చూర్ తీసుకోండి

పెరుగుకు బదులుగా మజ్జిగ (పగటిపూట) తీసుకోండి.

టమోటాకు బదులుగా దోసకాయ లేదా క్యారెట్ తినండి.

పురుషులు పుల్లని పదార్థాలను తక్కువ పరిమాణంలో, సరైన సమయంలో తినాలి. మీ వయస్సు, జీవనశైలి, శరీర అవసరాలకు తగినట్టు మాత్రమే పుల్లని పదార్థాలను ఆహారంలో చేర్చుకోండి. ఎక్కువ పుల్లని పదార్థాలను తినే అలవాటును మానుకోకపోతే, అది భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. కాబట్టి, మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, పుల్లని పదార్థాలను నియంత్రించడం చాలా ముఖ్యం.

# సైకిళ్ల పంపిణీతో విద్యలో పోటీ

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

### హుజురాబాద్‌లో పదవ తరగతి ప్రభుత్వ విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన బండి



హుజురాబాద్, జూలై 17 జనతా న్యూస్: గ్రామీణ నిరుపేద విద్యార్థులు వేలాది మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, వారు ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు మైదానాల్లో గురువారం ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు పూర్తిగా వ్యాపార ధోరణిలో నడుస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ కళాశాలలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు కష్టపడి పాఠాలు చెప్తుంటే.. ర్యాంకులు ప్రైవేటు పాఠశాలలు కొనుగోలు చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తమ పంపిణీ చేసే సైకిళ్ళు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. విద్యార్థులు చదువులో పోటీపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా విద్యాధికారి వాసంతి, కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

### -మున్సిపల్ ఇంజనీర్ చిట్యాల శ్రీనివాస్



కోరుట్ల, జనతా న్యూస్: చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్ ప్రజలను కోరారు. గురువారం కోరుట్ల మున్సిపల్ లోని 16 వార్డులో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ బలిజ పద్మ రాజారెడ్డి ఆధ్వర్యంలో తడి పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ తడి పొడి చెత్తను వేరుచేసి వార్డులోకి వచ్చే చెత్త బండికి ఇవ్వాలని కోరారు. చెత్తను రోడ్లపై మురికి కాల్వలలో వేయకూడదని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా తడి పొడి చెత్తను వేరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ జగదీశ్వర్, ఆర్ పి పావని, బలిజ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్

### ఒక మార్పు అభివృద్ధికి మలుపు



కోరుట్ల, జనతా న్యూస్: కోరుట్ల పట్టణంలో ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా. ఈ రోజు పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ రవీందర్, పరిశీలించారు. పలు వార్డులలో తడి చెత్త- పొడి చెత్త హానికార చెత్త వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలని చెప్పారు. వానాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. కాలనీల్లో రోడ్ల పక్కన పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను సిబ్బందిచే తొలగించి శుభ్రం చేపించారు. రోడ్లపై అక్కడక్కడ నిలువ ఉన్న నీరుని తొలగించి భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలతో పూడ్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ,ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, జవాన్లు వార్డ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లపై కాంగ్రెస్ బిఆర్ఎస్ డ్రామాలు

### కాంగ్రెస్ టిఆర్ఎస్ కుమ్మక్కు

### కేంద్రమంత్రి బండి సంజయ్



హుజురాబాద్, జూలై 17 జనతా న్యూస్: బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీలు తమ రాజకీయ అవకాశవాదం కోసం ప్రాకులాడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. హుజురాబాద్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్లపై ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. కానీ.. నిన్న కేంద్ర పెద్దన్న పాత్ర పోషించి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తే ఇద్దరూ విభిన్నమైన ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. అసలు సమావేశంలో ఏం జరిగిందో ఇద్దరు ముఖ్యమంత్రులు బయటికి చెప్పాలని ఆయన సవాల్ చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య జలవివాదాలు చాలాకాలంగా ఉన్నాయని నిపుణుల కమిటీతో కేంద్రం దాన్ని పరిష్కరిస్తుందని బండి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ దగా చేస్తోందని బండి విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 51% బీసీలు ఉన్నట్లు తన సర్వేలో వెల్లడిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఉందని చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మిగతా 18 లక్షల మంది బీసీల కు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆయన అన్నారు. బీసీ సంఘాలు కాంగ్రెస్ పార్టీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మత రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని, 10% రిజర్వేషన్ మైనారిటీలకు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. తద్వారా బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. తాము బీసీల విషయం ప్రశ్నిస్తే.. మత రాజకీయాలంటూ ఓటు బ్యాంకు రాజకీయాలను చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ల పై ఏసీబీ దాడులు జరుగుతుంటే కోట్ల రూపాయలు బయటపడుతున్నాయని, రాజకీయ నాయకుల వద్ద కూడా కోట్ల రూపాయలు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం విషయంలో ఫోన్ టాపింగ్ విషయంలో బిఆర్ఎస్కు నష్టం కలగకుండా వ్యవహరిస్తుందని, రెండు పార్టీలు లోపాయి గారి ఒప్పందంకు దోచుకున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్రం నుండి కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చినట్టు బండి వెల్లడించారు. బిజెపిలో గ్రూపుల పోరు లేదని, ఎవరైనా గ్రూపుల పేరుతో రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కష్టపడే వారికి పదవులు వస్తాయని ఆయన అన్నారు. ఎవరైనా నరేంద్ర మోడీ కోసం, పార్టీ కోసం పనిచేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. గతంలో గంగాడి కృష్ణారెడ్డి కూడా తనకు వ్యతిరేకంగా పనిచేశాడని కానీ గంగాడి కర్ణాటకలో పార్టీ కోసం పనిచేశాడని, ఆయన కృషిని గుర్తించి తన విజ్ఞప్తి మేరకు పార్టీ పటిష్టత కోసం పునరంకితమయ్యాడని బండి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గంగారెడ్డి కృష్ణారెడ్డి, తూర్పాటి రాజు, పైళ్ల వెంకటరెడ్డి, విజయేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నల్ల సుమన్, గంగిశెట్టి రాజు, యాంసాని శశిధర్, గంగిశెట్టి ప్రభాకర్, క్యాస వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం




### అన్ని కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకే

### ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గస్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమం గురువారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పివి ప్రధానిగా ఉన్నప్పుడు మహిళా సంఘాలు ప్రారంభం అయ్యాయని వైయస్ రాజశేఖర్ ద్యామ్ లో వడ్డీ లేని రుణాలు అందించి మహిళలను లక్ష అధికారులు చేశారని రేవంత్ రెడ్డి సర్కారు వడ్డీ రుణాలను అందిస్తూ కోటీశ్వరులు చేయాలని ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళలు స్వతగా ఎదిగేందుకు మహిళా సంఘాలు తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే మహిళలకు, మహిళా సంఘాలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రమాద బీమా, లోన్ బీమా కల్పిస్తూ హైర్ బస్సుల ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేసి నిర్వీర్యం చేసిందని, ఓట్లు దండుకునే కార్యక్రమాలు చేపట్టిందని ఆరోపించారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబాలు బాగుంటాయని, క్రమశిక్షణతో ఉంటుందని అన్నారు. తమ పిల్లలను బాగా చదివించి గొప్ప తల్లిదండ్రులుగా నిలవాలని సూచించారు. వడ్డీ లేని రుణాలు మహిళలకు ఊరటనిస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలని మహిళా సంఘాల కే పూర్తిగా అప్పగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి అత్యధిక కుట్టుమిషన్లను ఐదింటిని అందిస్తామని తెలిపారు. మహిళలు ఈ జగతికి జీవనజ్యోతి అని పిల్లలపై తల్లి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అందుకే మహిళలు క్రమశిక్షణగా ఉంటూ ఆ కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీధర్, సే ర్ఫ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి, ఇన్చార్జ్ ఎంపీడీవో సురేందర్, జిల్లా మహిళా సమాఖ్య, మండల మహిళా సమాక్య ప్రతినిధులు, ఏపీఎంలు, నాయకులు బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ఎస్ఎల్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల,జనతా న్యూస్: కోరుట్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చిరంజీవిని గురువారం రోజున కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారికీ పుష్ప గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటానని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ స్టేట్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి,మెట్ పల్లి మైనారిటీ ఎక్స్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఖుతుబుద్దీన్, మొహమ్మద్ ఖిజర్, కోరుట్ల కాంగ్రెస్ నాయకుడు మైనారిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫైసల్, తదితరులు పాల్గొన్నారు.



